

శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కనులపండువగా శ్రీనివాస కల్యాణం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర బస్ డిపో వీధిలో శుక్రవారం శ్రీనివాస కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణ వేడుక జరిగింది. తర్వాత భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొని తీర్థప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మందా సూర్యప్రకాష్, విష్ణుమోహన్, అనురాధ, బాలప్రసాద్, బీజేపీ నాయకులు ఆర్.సంతోష్, రామకృష్ణ, సూరి, కృష్ణ పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి

నల్లకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మాతా రమాబాయి అంబేడ్కర్ అని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గోపి రజక అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్‌లోని శతాబ్ది భవనంలో రాష్ట్ర రజక, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రమాబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బహుజన బిడ్డల భవిష్యత్ కోసం తన బిడ్డలను త్యాగం చేసిన త్యాగమూర్తి రమాబాయి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి వెంకటయ్య, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



రమాబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గోపి రజక, వెంకటయ్య



బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ సీటు కైవసం చేసుకోవాలి

● బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ సీటు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్లు బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ పక్షాన భరత్‌గౌడ్‌కు సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జిల్లా పరిధిలోని ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలలో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా పనిచేస్తాన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అమలు కోసం నియోజకవర్గాల వారిగా ఉద్యమాలు చేపడతామన్నారు. సాయికృష్ణయాదవ్ మాట్లాడుతూ భరత్‌గౌడ్ నాయకత్వంలో అడిక్‌మెట్ డివిజన్‌లో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శేషసాయి, కౌండిన్యప్రసాద్,ఎం.సి.మోహన్, నరేష్, రామారావు, వంశీ, ఓంప్రకాష్, నరేష్, ప్రభాస్, ప్రదీప్, జగదీష్, బిఎంఎస్ వెంకటేశ్; సంగం బాల్‌రాజ్, చంద్రశేఖర్, జనార్ధన్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, దర్గా నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రానికి అవసరమైన పత్రాల కోసం లంచం డిమాండ్ చేసి తీసుకున్న బీసీ కమిషన్ కార్యాలయంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో గొల్ల శ్రీనివాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుల ధ్రువీకరణ పత్రానికి అవసరమైన దరఖాస్తుతో బాధితుడు శ్రీనివాస్‌ను సంప్రదించాడు. పని చేసేందుకు శ్రీనివాస్ లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు బాధితుడు రూ.1 లక్ష శ్రీనివాస్‌కు ఇచ్చాడు. అక్కడే కాపుగాసిన ఏసీబీ అధికారులు వెంటనే దాడి చేసి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని కెమికల్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్ పాజిటివ్ రావడంతో శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి, నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.



పట్టుబడ్డ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గొల్ల శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నేత దుర్మరణం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆ పార్టీ సీనియర్ నేత కవాడిగూడకు చెందిన రంజరాజాగౌడ్(73) శుక్రవారం మధ్యాహ్నం చిక్కడపల్లి మెట్రో స్టేషన్‌వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. రంగరాజాగౌడ్‌కు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో బీజేపీ సీనియర్ నేత రాగం రవికుమార్‌తోపాటు రంగరాజాగౌడ్ ద్విచక్రవాహనంపై బర్కత్‌పురాలోని బీజేపీ కార్యాలయానికి బయలుదేరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి చిక్కడపల్లి మీదుగా బర్కత్‌పురకు వెళ్తుండగా చిక్కడపల్లి చౌరస్తాలో ఉన్న యూ టర్న్ నుంచి వేగంగా వచ్చిన ఆటో డ్రైవర్ రవికుమార్, రాజాగౌడ్ వెళ్తున్న వాహనాన్ని వెనుకనుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో వెనుక కూర్చున్న రాజాగౌడ్ కిందపడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడినుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. రాజాగౌడ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వాహనాన్ని నడుపుతున్న రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సీసీ ఫుటేజీల ద్వారా ఆటో నంబర్, ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. కాగా రాజాగౌడ్ అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి డా.లక్ష్మణ్‌లు హాజరౌతారని బీజేపీ నాయకులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజాగౌడ్(ఫైల్)

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం పట్టాలు దాటుతుండగా తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి బంగారు ఆభరణాలు, నగదు చోరీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును దొంగలు తస్కరించారు. నగరంలోని అల్వాల్‌కు చెందిన గిరిరాజు ఆగర్వాల్(58) జైపూర్‌లో బిక్‌నూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వస్తున్నాడు. కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో బ్యాగు కనిపించలేదు. దానిలో 26 గ్రాముల బంగారు ఆభరణాలు, 24 వేల నగదు ఉంది. శుక్రవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో గిరిరాజు ఆగర్వాల్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



చిక్కడపల్లి వెంకటస్వామి వీధిలో డ్రైనేజీ లైన్ వేసి రోడ్డు వేయకపోవడంతో...



చిక్కడపల్లి ఈశ్వర్‌రెడ్డి వీధిలో డ్రైనేజీ లైన్ వేసి రోడ్డు వేయని దృశ్యం

చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ వేసి రోడ్డు వేయని దృశ్యం

డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారు..

రోడ్లు వేయడం మరిచారు

నిత్యం నరకయాతనకు గురవుతున్న చిక్కడపల్లివాసులు

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో చిక్కడపల్లి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిక్కడపల్లి వెంకటస్వామి వీధి, ఈశ్వర్‌రెడ్డి వీధి, న్యూఎరా కాలేజీ చౌరస్తా, సోప్ ఫ్యాక్టరీ వీధి, లతామెన్షన్ వీధులలో కొన్ని నెలల క్రితం డ్రైనేజీ నూతన లైన్ల కోసం రోడ్లను తవ్వి కొత్త లైన్లు వేశారు. తవ్విన ప్రాంతంలో రోడ్లు పునర్ నిర్మించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడం, అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. తవ్విన రోడ్లలో గుంతలుపడి ప్రజలు నడవలేని స్థితి, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పైప్‌లైన్‌లు వేసి రోడ్లు నిర్మించలేని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే రోడ్లు వేయాలి



చిక్కడపల్లి ప్రాంతంలోని పలు వీధులలో డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి రోడ్డు పునర్ నిర్మించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. దీంతో స్థానికులు గుంతలమయమైన రోడ్లలో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే ఈ వీధుల్లో రోడ్డు పనులు చేపట్టాలి. - పలుస బాల్‌రాజ్‌గౌడ్, టీడీపీ మాజీ కార్పొరేటర్



చిక్కడపల్లిలోని లతామెన్షన్ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ వేసి మరమ్మతులు చేయకపోవడంతో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. విఠల్‌వాడీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని బసంత్ కాలనీ, లింగంపల్లి, వైశ్యా హాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ క్రాస్‌రోడ్, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12, గోల్కొండ క్రాస్‌రోడ్ పరిధిలోని ఏక్‌మినార్ మసీదు, కృష్ణాకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో 11 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జాతీయ తైక్వాండోలో హర్షభద్రకు సిల్వర్ మెడల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో 38వ జాతీయ క్రీడా పోటీల్లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్గొన్న హర్షభద్ర విద్యార్థినీ సిల్వర్ మెడల్ సాధించింది. శుక్రవారం తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారి సతీష్‌గౌడ్‌లు ఆమెను సన్మానించారు. మొట్టమొదటి సారి మహిళా విభాగంలో సిల్వర్ మెడల్ హర్షభద్ర సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీనియర్ కోచ్ బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్య ఆస్పత్రి సేవలు స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలతో నాణ్యమైన వైద్యం అందిస్తున్న సౌమ్య ఆస్పత్రి యాజమాన్యం సేవలు స్ఫూర్తిదాయకం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం మానవ సేవయే మాధవ సేవ స్ఫూర్తితో వైద్య సేవలు అందించాలని సూచించారు. రాంనగర్‌లో అత్యాధునిక సేవలు, ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన సౌమ్య ఆస్పత్రిని శుక్రవారం ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎస్.రాజేశ్వర్ రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని స్థానిక ప్రజలకే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు నాలుగు దశాబ్దాలుగా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న సౌమ్య ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎస్.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు తక్కువ ఖర్చుతో అందించడం తమ ప్రత్యేకత అన్నారు. తమ ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అందిస్తున్నామన్నారు. తన సతీమణి దివంగత డాక్టర్ వరలక్ష్మి పేరు మీద తరచు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆస్పత్రిలో తన ఇద్దరు కుమారులు, కుమార్తె, కోడలు అందరూ వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు.



రాంనగర్‌లోని సౌమ్య ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాజేశ్వర్‌రావు తదితరులు

కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ షాను శ్రీనివాస్, డాక్టర్ సాహిత్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్యామ్‌సాకార్, డాక్టర్ శ్రీకీర్తి, శ్రీనివాస షాపింగ్ మాల్ యజమాని చెరుపల్లి యాదగిరి, వాణిసత్యం, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్.మోజెస్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, నేత శ్రీనివాస్, గురుదీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ధోబీ ఘాట్ బస్తీలో శుక్రవారం ఈదమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ప్రత్యేక పూజల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌ను బస్తీవాసులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ యువత భక్తి మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ రజక అభివృద్ధి సంఘం చైర్మన్ నరసింహ, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి. నవీన్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం. ఉమేష్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

బంధిత కార్మిక నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర అదనపు కార్మిక కమిషనర్ గంగాధర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బంధిత కార్మికుల (బాండెడ్ లేబర్) నిర్మూలనకు కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్ అన్నారు. కార్మికశాఖ, దివ్యదిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కార్మికశాఖ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం దివ్యదిశ రూపొందించిన పోస్టర్‌ను గంగాధర్ ఆవిష్కరించి మాట్లాడుతూ బాండెడ్ లేబర్‌ను రెస్క్యూ ఎలా చేయాలి వారిని వారి వారి ప్రాంతాలకు, రాష్ట్రాలకు ఎలా పంపించాలి వంటి అంశాలు కార్మికశాఖ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దివ్యదిశ ప్రతినిధులు ఫిలిప్స్, అభిషేక్, కృష్ణన్, జేసీఎల్‌లు జి సునీత, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, డీసీఎల్‌లు జాసన్, శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌సుందర్‌జాజు, ప్రమోద్ రెడ్డి,రవీందర్‌రెడ్డి, ఏసీఎల్‌లు, ఏఎల్‌వోలు పాల్గొన్నారు.



బంధిత కార్మికుల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్

● యాజమాన్యాలపై కేసులు నమోదు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో కార్లకు ఏర్పాటు చేసిన టిన్టెడ్ గ్లాసెస్, బ్లాక్ ఫిల్మ్‌లు, సైరన్‌లు, మల్టీ టోన్డ్ మ్యూజిక్ హారన్‌లపై తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ విభాగం నగర అదనపు కమిషనర్ ఆదేశాలమేరకు చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్ వీరేశం పర్యవేక్షణలో సిబ్బంది చెకింగ్‌లు చేపట్టారు. ఈ సందర్భంగా 2 సైరన్‌లు, 11 బ్లాక్ ఫిల్మ్‌లు ఏర్పాటు చేసుకున్న కార్లపై కేసులు నమోదు చేసి చలాన్‌లు విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం వివరించారు.



చెక్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి

● మాజీ ఎంపీ వి. హనుమంత రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి బీసీ పక్షపాతి అని బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో అసెంబ్లీలో కులగణన నివేదికను ప్రవేశపెట్టారన్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో హన్మంతరావు విలేకరులతో మాట్లాడుతూ కులగణనతో బీసీలకు న్యాయం చేస్తున్నామని చెప్పడానికే సూర్యాపేటలో రాహుల్ గాంధీతో బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేస్తున్నందుకు గజ్వేల్‌లో ఏర్పాటు చేసే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. గతంలో విజయ భాస్కర్ రెడ్డితో సూర్యాపేటలో సభ పెడితే 2 లక్షల మంది వచ్చారని గుర్తు చేశారు. రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీజేపీకి లేదని బీసీలంతా బీజేపీపై పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించారని, స్వాతంత్ర్యాన్ని అవమానిస్తున్నారని హన్మంతరావు మండిపడ్డారు. బీసీల్లో క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రకటనలకు పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లాని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా తాను అక్కడికి వెళ్లి న్యాయ పోరాటం చేస్తున్నట్లు హన్మంతరావు పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు పరిష్కరించాలి

● సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు బలరామ్

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు సందీర్ల బలరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర సదస్సు, 2025 డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల విధి నిర్వహణ కాలాన్ని సర్వీసుగా పరిగణించి రాష్ట్రవ్యాప్తంగా గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శిగా ఒకే తేదీని నిర్ధారణ చేస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేస్తూ ఓపీఎస్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో 12, 769 గ్రామ పంచాయతీలను జనాభా ప్రాతిపదికగా గ్రేడ్‌లుగా విభజిస్తూ ప్రతి జిల్లా వారిగా ఖచ్చితమైన క్యాడర్ స్ట్రెంత్‌లను నిర్ధారణ చేస్తూ పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వం ఏ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం చేపట్టిన క్షేత్రస్థాయిలో ఆ పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన కార్యదర్శులకు గుర్తింపు కల్పిస్తూ ఆ కార్యదర్శి పేర్లను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవోఎస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లు మాట్లాడుతూ పంచాయతీరాజ్ కార్యదర్శుల డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్.రంజిత్‌కుమార్, కె.సదానందం, ఎండి.రఫీ, శ్రావణ్‌కుమార్, పి.వెంకటరమణ, నిరంజన్, సురేందర్, కల్పన, రమాదేవి, మల్లేష్‌గౌడ్, భాస్కర్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం సదస్సులో మాట్లాడుతున్న బలరామ్, తదితరులు

11న ఉపాసన సాహితీ సమర్చన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి ఉపాసన సంస్థ స్థాపించి తమ వంతు కృషి చేస్తున్న డా. మహేశ్వరి, డా. సీతాపతి వోలేటి దంపతులు ఈనెల 11న మరో సాహితీ కార్యక్రమం చేపట్టారు. త్యాగరాయగానసభలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు దివాకర్‌రావు, కోశాధికారి కల్యాణిలతో కలిసి వారు కార్యక్రమాలు వివరాలు తెలిపారు. పద్య కళా తపస్వి డా. ధూళిపాళ మహాదేవ మణి రచించిన బృహత్ శ్రీ ధరీయం పద్యకావ్యం ఆవిష్కరణ ఆయనకు ఉపాసన సన్మాన కార్యక్రమం చేస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి

అంబర్‌పేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి అన్నారు. క్రీడల్లో రాణిస్తే వారు మానసికంగా పరిణతి చెందిన అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 హాకీ క్రీడలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. హాకీ పోటీల్లో అంబర్‌పేట ప్రేమ్‌నగర్ హైమావతి పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో ప్రథమ బహుమతి, బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన హైమావతి పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆర్టీసీ ఈడీ , లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం బస్‌భవన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఈడీ మునిశేఖర్, లేబర్ కమిషనర్ గంగాధర్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 వేతన సవరణకు సంబంధించిన ఏయిరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, వెల్ఫేర్ బోర్డును రద్దు చేసి ట్రేడ్ యూనియన్‌లను వెంటనే అనుమతించాలని, చట్ట వ్యతిరేక డ్యూటీలను తీసివేయాలని, ఖాళీగా ఉన్న అన్ని విభాగాల్లోకి రిక్రూట్‌మెంట్‌ను భర్తీ చేయాలని, మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆధార్ కార్డులతో కాకుండా స్మార్ట్ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్మిక నాయకులు దేవికె.రావు పలువురు తదితరులు పాల్గొన్నారు.